సాక్షి
ఖమ్మం
గురువారం, 26, సెప్టెంబర్, 2024



ఆగని మైనింగ్ మాఫియా!

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు, తరలింపుతో పాటు ఇసుక దందా ఏ మాత్రం తగ్గడం లేదు. 8లో



యాజమాన్య పద్ధతులే కీలకం

పత్తి రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. 8లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ ప్రభావం కనిపిస్తుంది. మధ్యాహ్నంకల్లా ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశముంది.

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.29.51లక్షలు



లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.వీరస్వామి, ఈఓ కె.జగన్మోహన్‌రావు లెక్కించగా 91 రోజులకు గాను రూ.29,51,477 ఆదాయం నమోదైంది. అనంతరం వచ్చే నెల 3వ తేదీ నుండి ఆలయంలో నిర్వహించనున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది, మధిరకు చెందిన శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

2,400 క్యూసెక్కుల నీటి విడుదల

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నుండి ఎడమ కాల్వ ద్వారా విడుదల చేస్తున్న నీటిని క్రమక్రమంగా పెంచుతున్నారు. కాల్వకు పడిన గండ్ల మరమ్మతులు మంగళవారం పూర్తికాగా నీరు విడుదల చేసిన విషయం విదితమే. తొలుత 500 క్యూసెక్కుల నీటిని కాల్వకు విడుదల చేయగా దీనిని బుధవారం 2,400 క్యూసెక్కులకు పెంచారు. గండ్ల పూడ్చివేత చేపట్టిన చోట పరిశీలిస్తూ నీటి విడుదలను పెంచుతున్నారు. ప్రస్తుతం ఎలాంటి అవాంతరాలు ఎదురుకాకపోవడంతో నీటి విడుదల కొనసాగుతోంది. ఇదేసమయాన గండ్ల పూడ్చివేత పనులను పూర్తిస్థాయిలో చేపట్టడంపై అధికారులు దృష్టి సారించారు.

సిరిసిల్ల మత్స్యకారులకు శిక్షణ

కూసుమంచి: మండలంలోని పాలేరు శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో సిరిసిల్ల జిల్లా మత్స్య సహకార సంఘాల సభ్యులకు బుధవారం శిక్షణ మొదలైంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకారులు ఆధునిక విధానాలపై అవగాహన పెంచుకుని మెరుగైన దిగుబడి సాధించాలని సూచించారు. అనంతరం శాస్త్రవేత్త రవీందర్ చేపలకు సోకే వ్యాధులు, నివారణ చర్యలు, ఇంజక్షన్ వేసే విధానంపై అవగాహన కల్పించారు.

దర్యాప్తులో ఆధారాల సేకరణే కీలకం



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: బాధితులకు న్యాయం జరగాలంటే కేసు దర్యాప్తులో ఆధారాల సేకరణ కీలకంగా నిలుస్తుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. జిల్లాస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఖమ్మం పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం సీపీ ప్రారంభించగా 40మంది అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీస్ జాగిలాలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీ మాట్లాడుతూ నేరస్తులు కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో దర్యాప్తులో మెళకువలు పెంపొందించుకునేందుకు డ్యూటీ మీట్ దోహదపడుతుందని తెలిపారు. అంతేకాక ఉద్యోగుల ఆలోచనలను మార్పిడి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకతను సీపీ వివరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, ఏసీపీలు రవి, సాంబరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి ఎన్.మాధవి తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో సుమారు 850 పోస్టుల భర్తీకి ఈ మేళా ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. అపోలో ఫార్మసీ, హెల్త్‌కేర్, మెడ్‌ప్లస్ ఫార్మసీ, హెటిరో ల్యాబ్స్, మధుకాన్ షుగర్స్ అండర్ పవర్ లిమిటెడ్, సత్యమైక్రో క్యాపిటల్, ముత్తూట్, భారత్ పే, శ్రీరాం లైఫ్ తదితర కంపెనీల బాధ్యులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు విద్యార్హతలు, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని, వివరాలకు 90638 58341 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఏఆర్ మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు



సీఎంఆర్.. స్వాహా

ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో భారీగా తేడా

- 2.50లక్షల క్వింటాళ్ల మేర తక్కువ ఉన్నట్లు గుర్తింపు
- రెండు రోజుల పాటు తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు
- ఇక్కడి అధికారులు 'మామూలు'గా పట్టించుకోలేదనే ఆరోపణలు
- మరికొన్ని మిల్లుల్లోనూ తనిఖీ చేయనున్న బృందాలు



ధాన్యం నిల్వలపై రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను పలువురు మిల్లర్లు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలకు బలం చేకూరేలా పలు అంశాలు టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీల్లో బయటపడుతున్నాయి. పలుమార్లు గడువు పెంచినా మిల్లర్ల తీరు మారకపోవడంతో కనీస స్థాయిలో కూడా సీఎంఆర్ చెల్లించని మిల్లులపై ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన పౌర సరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ బృందాలతో తనిఖీ చేయిస్తోంది. మంగళ, బుధవారాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు కొణిజర్ల మండలం లాలాపురంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లు చెల్లించాల్సిన సీఎంఆర్, ప్రస్తుతం ఉన్న నిల్వల లెక్కలు వేస్తే దాదాపు 2లక్షల క్వింటాళ్లకు పైగా క్వింటాళ్ల వ్యత్యాసం ఉన్నట్లు తేలింది. దీంతో మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ మిల్లు వ్యవహారంలో జిల్లా అధికారులకు భారీగా ముడుపులు అందాయని, అందుకే పట్టించుకోలేదని తెలుస్తోంది. ఇప్పుడు సీఎంఆర్ పక్కదారి పట్టించినట్లు తేలడంతో జిల్లాలోని మరికొన్ని మిల్లుల్లో పరిశీలనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

50 శాతం కూడా ఇవ్వలే...

జిల్లాలోని కొన్ని మిల్లులు కనీసం 50 శాతం సీఎంఆర్ కూడా చెల్లించలేదు. మరికొన్ని మిల్లులైతే 4, 9 శాతమే చెల్లించాయి. దీంతో ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ టాస్క్‌ఫోర్స్ బృందాలతో దాడులు చేయిస్తోంది. ఈక్రమాన లాలాపురంలో ఉన్న ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో రెండు రోజులు తనిఖీలు చేపట్టారు. అయితే, జిల్లాలో 50 శాతం సీఎంఆర్ చెల్లించని మిల్లులు 10 నుంచి 20 వరకు ఉండగా.. వీటిలోనూ తనిఖీలు జరుగుతాయని సమాచారం.

భారీగా ముడుపులు?

ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లు వ్యవహారంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులకు మిల్లు యాజమాన్యం నుంచి భారీ స్థాయిలో ముడుపులు అందినట్లుగా ప్రచారం జరుగుతోంది. అందుకే పౌర సరఫరాల సంస్థ అధికారులు ఇన్నాళ్లు తనిఖీలు చేయలేదని సమాచారం. అధికారులతో ఉన్న సత్సంబంధాల నేపథ్యాన సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యాన్ని బయట విక్రయించినట్లు తెలుస్తోంది. రూ.కోట్లలో ముడుపులు అందడంతోనే ధాన్యం బయటకు తరలించినా, సీఎంఆర్ ఇవ్వకున్నా అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వ సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలకు దిగినట్లు సమాచారం.

ధాన్యం విలువ రూ.100కోట్లకు పైమాటే..

లాలాపురంలోని ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు కమల్ భాషా, ఆర్.పుల్లయ్య, స్వామిదాస్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత ఆధ్వర్యాన తనిఖీలు జరిగాయి. 2022–23 రబీ, 2023–24 ఖరీఫ్ సీజన్లకు గాను 3,50,622 క్వింటాళ్ల ధాన్యాన్ని ఈ మిల్లుకు పౌర సరఫరాల సంస్థ కేటాయించింది. ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి సీఎంఆర్ చెల్లించింది కలిపి ప్రస్తుతం 99,012 క్వింటాళ్ల ధాన్యం ఉంది. మిగతా 2,51,499 క్వింటాళ్ల ధాన్యానికి లెక్కలు లేవని ప్రాథమికంగా గుర్తించారు. క్వింటాకు రూ.4 వేల చొప్పున లెక్కించినా వ్యత్యాసం ఉన్న ధాన్యం విలువ దాదాపు రూ.100.59 కోట్ల మేర ఉంటుందని అంచనా. ఈ వ్యవహారంలో మిల్లు యజమాని ఎం.రమాజ్యోతిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మిగతా ధాన్యానికి పైకం చెల్లిస్తాం

మా మిల్లు సామర్థ్యం 50 వేల క్వింటాళ్లు. కానీ ప్రభుత్వం అందుకు మూడు రెట్లు ధాన్యాన్ని బలవంతంగా అంటకట్టింది. అయినా మేము బియ్యం మర ఆడించి పంపిస్తే వారాల తరబడి గోదాం వద్ద వాహనాలు నిలిపి ఉంచారు. ఆపై ఎంపిటీ పరీక్షలో ఫెయిల్ అయిందని తిప్పి పంపించారు. అంతేకాక తడిసిన, ఇతర రకాల ధాన్యం ఇవ్వడంతో 30 శాతం నుండి 40 శాతం పాడైపోయింది. ఏది ఏమైనా అధికారులు తేల్చిన వ్యత్యాసానికి సంబంధించి ధాన్యం విలువను ప్రభుత్వానికి చెల్లిస్తాం.

– బాలకృష్ణ, సహ యజమాని, ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ మిల్లు, లాలాపురం, కొణిజర్ల

భవిష్యత్ బాగుండేలా అభివృద్ధి

- నీటి ప్రవాహక దారులు ఆక్రమిస్తేనే విపత్తులు
- పేదలకు అన్యాయం జరగకుండా అభివృద్ధి పనులు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ప్రతీ అభివృద్ధి పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం 16వ డివిజన్ శ్రీరాంనగర్ రోడ్డు నంబర్ 13లో రూ. 50లక్షలతో నిర్మించనున్న స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఖమ్మం నగరంలో జరిగే ప్రతీ అభివృద్ధి పనిని అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించడం ద్వారా నిధులు వృథా కాకపోగా ప్రజల ఇబ్బందులు తీరతాయని తెలిపారు. డ్రెయిన్లు నిర్మించే క్రమాన శాస్త్రీయంగా ఎత్తుపల్లాలు ఎంచుకుంటే నీరంతా సాఫీగా సాగుతుందన్నారు. కాగా, నాలాలు, రహదారులను ఆక్రమించడంతోనే భారీ వర్షాలు వచ్చినప్పుడు విపత్తులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇక నగరంలో గ్రీనరీ పెంచేందుకు మొక్కలు నాటే సమయంలో అవి పెరిగే ఎత్తు, విద్యుత్ తీగల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కాగా, అభివృద్ధి పనులు చేపట్టే సమయాన పేదలకు అన్యాయం జరగకుండా చూస్తామని, వెలుగుమట్ల పార్క్ అభివృద్ధి చేసే క్రమంలో ఆక్రమణలు తొలగించాల్సి వస్తే పేదలకు ఇళ్లు, స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కమిషనర్ సంపత్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, తహసీల్దార్ సీహెచ్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు, ఉత్తమ వైద్యం

- అవసరమైన పరికరాలపై ప్రతిపాదనలు ఇవ్వండి
- జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఉత్తమ వైద్యం అందించేలా దృష్టి సారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిని బుధవారం తనిఖీ చేసిన ఆయన వివిధ విభాగాల్లో పరిశీలించారు. చికిత్స కోసం వచ్చిన వారి సహాయకులతో మాట్లాడి అందుతున్న సేవలు, సమస్యలపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన సేవలందించేలా కావాల్సిన పరికరాలపై ప్రతిపాదనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భోజనం రుచికరంగా ఉండడంతో పాటు పోషకాలు ఉండాలన్నారు. ఆస్పత్రిలో నూతన ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, సీఎస్ ఆర్‌ఎంఓ కళావతిబాయి, డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రణాళికాయుతంగా చెత్త సేకరణ

ఖమ్మం సహకారనగర్: ఇళ్ల నుంచి డంపింగ్ యార్డు వరకు తడి, పొడి చెత్త వేర్వేరుగా చేరేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని, భూమి అందుబాటులో ఉంటే యార్డుకు వెళ్లేలా రోడ్లు వేయాలని తెలిపారు. విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బంది వందశాతం హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే, పన్నుల వసూళ్లు, అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ శ్రీజ, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, అహ్మద్ షఫీఉల్లా, వేణు పాల్గొన్నారు. కాగా, కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును కలెక్టర్ పరిశీలించి భద్రతపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డీటీ అన్సారీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కోరారు. ఆయన చింతకాని మండలం కొదుమూరు, బస్వాపురం, కొణిజర్ల మండలం మునగాల, గోపతి, వైరా మండలం సిరిపురం, సోమవరం, పెనుబల్లి మండలం చింతగూడెంల్లో హైవే నిర్మాణానికి భూమి కోల్పోనున్న వారితో సమావేశమై నష్టపరిహారంపై చర్చించారు. భూమి ఇచ్చే వారికి మెరుగైన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొరత తీరినట్లే...

- జిల్లాకు భారీగా స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు
- రెండేళ్ల కాలానికి సరిపడా నిల్వలు
- వెండర్లు కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు



ఉమ్మడి జిల్లాలో స్టాంప్ పేపర్ల కొరత ఏర్పడకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.32.26 కోట్లకు పైగా విలువైన స్టాంపు పేపర్లు చేరాయి. ఈ నిల్వలు రెండేళ్ల కాలానికి సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

– ఖమ్మం మయూరిసెంటర్

కృత్రిమ కొరత సృష్టించకుండా..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వీటి పరిధిలో 160 మంది స్టాంప్ పేపర్లు విక్రయిస్తుంటారు. ఇటీవల జిల్లాలో స్టాంప్ పేపర్ల నిల్వలు తగ్గడంతో కృత్రిమ కొరత సృష్టించిన వెండర్లు అధిక ధరలకు విక్రయించడం మొదలు పెట్టారు. మండల కేంద్రాల్లో రూ.100 స్టాంప్ పేపర్‌ను రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు అమ్ముతుండడంతో అధికారులు భారీగా స్టాంప్ పేపర్లను తెప్పించారు.

అన్ని డినామినేషన్లు...

కోర్టు ఫీజుకు అవసరమైన రూ.1, రూ.2, రూ.5 స్టాంపులతో పాటు రూ.20, రూ.50, రూ.100 విలువైన నాన్ జ్యూడీషియల్ స్టాంప్ పేపర్లు, రూ.10విలువైన నోటరీ స్టాంప్ పేపర్లే కాక రూ.1విలువైన రెవెన్యూ స్టాంపులను తెప్పించగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నిల్వ చేశారు. వీటిని జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేరవేసి, వాటి పరిధిలోని స్టాంప్ వెండర్లకు కేటాయించనున్నారు.

రూ.10 స్టాంప్ పేపర్లు అత్యధికం

ఉమ్మడి జిల్లాకు రూ.32.26 కోట్లకు పైగా విలువైన స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు వచ్చాయి. ఇందులో అత్యధికంగా రూ.10 విలువైన నోటరీ స్టాంప్ పేపర్లు 5.40 లక్షల మేర ఉన్నాయి. రూ.20 స్టాంప్ పేపర్లు 3.60 లక్షలు ఉండగా, రూ.100 విలువైనవి 3.04 లక్షలు వచ్చాయి. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10, రూ.20, రూ.100 స్టాంప్ పేపర్లను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇవి అధిక మొత్తంలో రావడంతో కొరత తీరినట్లేనని చెబుతున్నారు.

స్టాంప్‌లు, స్టాంప్ పేపర్ల సంఖ్య, వాటి విలువ

స్టాంప్‌లు, స్టాంప్ పేపర్లు	సంఖ్య	విలువ (రూ.ల్లో)
రూ.1 (కోర్టు ఫీజు)	1,60,000	1,60,000
రూ.2 (కోర్టు ఫీజు)	2,64,000	5,28,000
రూ.5	2,56,000	12,80,000
రూ.20	3,60,000	72,00,000
రూ.50	56,000	28,00,000
రూ.100	3,04,000	30,40,40,000
రూ.10	5,40,000	54,00,000
రూ.1 (రెవెన్యూ స్టాంపులు)	12,80,000	12,80,000



వరద బాధితులకు త్వరలోనే సర్టిఫికెట్లు

- బాలికా దినోత్సవం ఇతివృత్తంగా బతుకమ్మ సంబురాలు
- 237 పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ
- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: భారీ వర్షాలు, వరదతో వివిధ రకాల సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి త్వరలోనే కొత్తవి జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి సర్టిఫికెట్ల కోసం 680, ఇంటర్ 454, డిగ్రీ/బీటెక్‌కు సంబంధించి 94, పీజీ 47 మంది, పాస్‌పోర్ట్ కోసం 29 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అలాగే, ఆదాయ సర్టిఫికెట్లు 269, కుల ధ్రువీకరణ పత్రాలు 376, నివాస ధ్రువీకరణ పత్రాలు 189, ఓబీసీ సర్టిఫికెట్లు 77, పాస్ పుస్తకాలు 88, ఆధార్ కార్డులు 388, రేషన్ కార్డులు కోల్పోయినట్లు 182 మంది దరఖాస్తులు ఇచ్చారని చెప్పారు. శాఖల వారీగా వివరాలు సేకరించి రెండు, మూడు వారాల్లోగా సర్టిఫికెట్లు జారీ చేయించనున్నట్లు ఆమె తెలిపారు.

ఆత్మరక్షణపై విద్యార్థినులకు శిక్షణ

జిల్లాలోని 237 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణపై వారానికి మూడు రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తున్నామని ఆమె తెలిపారు. ఇందుకోసం 120 మంది మాస్టర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించినట్లు చెప్పారు. ఇక ప్రతీ బుధవారం జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలోని 50 పాఠశాలల్లో ఇంగ్లిష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయగా, దశల వారీగా విస్తరిస్తామన్నారు.

2నుంచి బతుకమ్మ

వచ్చే నెల 2వ తేదీ నుంచి బతుకమ్మ సంబురాలు మొదలవుతాయని అదనపు కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం జరగనున్నందున బాలికల రక్షణ ఆవశ్యకతను వివరిస్తూ బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తామని చెప్పారు. '1098' ఆకారంలో బతుకమ్మలు పేర్చడం వల్ల ప్రజలకు ఈ నంబర్‌పై అవగాహన పెరుగుతుందని తెలిపారు.

ఆంగ్ల పరిజ్ఞానంపై ప్రత్యేక కోర్సు

ప్రభుత్వ పాఠశాలల్లోని 6, 7వ తరగతుల విద్యార్థుల్లో ఆంగ్ల పరిజ్ఞానం పెంచేలా ప్రత్యేక కోర్సు అమలు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీజ తెలిపారు. ఈ విషయమై అధికారులతో సమీక్షించిన ఆమె విద్యార్థులు ఆంగ్లంలో మాట్లాడడం, అర్థం చేసుకునేలా తీర్చిదిద్దేందుకు తొలిదశలో 16 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఈ సమావేశంలో డీఈఓ సోమశేఖరశర్మ, ఏఎంఓ రవి, ప్రాజెక్ట్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

సీనియారిటీ జాబితా రూపొందిస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ట్రాన్స్‌కో(ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్) సంస్థలో ఇంజనీర్లు, అధికారులు, ఉద్యోగుల సాధారణ బదిలీలపై బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీల విధివిధానాలు, మార్గదర్శకాలను ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. అంతేకాక ప్రస్తుత స్థానంలో అధికారులు, ఉద్యోగుల సీనియారిటీ జాబితాలు పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పీఅండ్‌జీ విభాగంలో జేపీఓలు, అకౌంట్స్ విభాగంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల్లో జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, ఎల్‌ఎం, ఎల్‌ఐ, ఎస్ఎల్‌ఐ, ఫోర్‌మెన్ గ్రేడ్–1, 2 ఉద్యోగుల జాబితా పంపించాలని సూచించగా.. సీనియారిటీ ఆధారంగా జోనల్ స్థాయిలో బదిలీ చేయనున్నారు. ఈమేరకు ఖమ్మం ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస్ ఆధ్వర్యాన జాబితాలు రూపొందిస్తుండగా అక్టోబర్ మొదటి వారంకల్లా బదిలీల ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని తెలిపారు. అయితే, ఖమ్మం ట్రాన్స్‌కో సర్కిల్ పరిధిలో 300 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఎందరికి బదిలీ అవుతుందో వేచి చూడాలి.

ఎన్పీడీసీఎల్ పరిధిలో కూడా...

ఎన్పీడీసీఎల్ పరిధిలో కూడా ఉద్యోగుల సాధారణ బదిలీలపై సీఎండీ కసరత్తు చేస్తున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేసేలా మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలు విడుదలవుతాయని, ఆపై అక్టోబర్ మొదటి వారం వరకు బదిలీలు పూర్తిచేసే అవకాశముందని సమాచారం.

ఆగని మైనింగ్ మాఫియా!

ప్రభుత్వం, అధికారులు మారినా వ్యాపారులదే హవా

- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు, తరలింపు
- రూ.కోట్లలో వ్యాపారుల అక్రమార్జన



మట్టి తరలిస్తుండగా రఘునాథపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఖమ్మంఅర్బన్: గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో రూ.కోట్ల విలువైన మట్టి తవ్వకాలు, తరలింపు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం మారి, అధికారులు కొత్త వారు వచ్చినా మాఫియాకు మాత్రం అడ్డుకట్ట పడలేదనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో హైవేల నిర్మాణానికి పెద్ద మొత్తంలో మట్టి తవ్వకాలు అవసరముండడంతో అధికారులే తాత్కాలిక పర్మిట్లు జారీ చేస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకున్న అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల్లోనూ అర్ధరాత్రి వేళ తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారని తెలుస్తోంది.

అనుమతులు అవసరమే లేదు...

జిల్లాలో మట్టి తవ్వకాలకు మూడు క్వారీలకే అనుమతి ఉంది. ఎర్రుపాలెం మండలంలోని రాజుపాలెం, రఘునాథపాలెం మండలంలోని కోయచలక, ఖమ్మం రూరల్ మండలం అరకోడు రెవెన్యూలో మాత్రమే క్వారీ లీజులు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో హైవే కోసం కాకుండా ఎక్కడ మట్టి తవ్వి తరలించినా అక్రమమేనని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ ఖమ్మం చుట్టుపక్కల భవన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి అవసరం ఉండడంతో డిమాండ్ పెరుగుతోంది. దీంతో గతంలో మట్టి తవ్వకం, అమ్మకాలతో రూ.కోట్లు దండుకున్న కొందరు మళ్లీ ఇటీవల దందా మొదలుపెట్టారని తెలుస్తోంది. ఇటీవల ఖమ్మం, రఘునాథపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, చింతకాని తదితర ప్రాంతాల్లో పోలీసులకు మట్టి వాహనాలు పట్టుపడుతుండడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఇసుక సైతం..

ఇసుక రేవులు జిల్లాలో ఎక్కడా లేవు. తహసీల్దార్లు ప్రభుత్వ అవసరాల కోసం ఇచ్చే అనుమతుల ఆధారంగా వాగులు, ఏర్లలో నీటి ప్రవాహం తగ్గినప్పుడు తీసుకెళ్లవచ్చు. కానీ ఇసుకకు డిమాండ్ ఉండడంతో జిల్లాకు సరిహద్దుగా ఉన్న ఏపీ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుండి లారీలు, టిప్పర్ల ద్వారా తెప్పిస్తున్నారు. అంతేకాకుండా గోదావరి పరీవాహక ప్రాంతాల జిల్లాల నుండి ఇసుక అక్రమంగానే తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వారం క్రితం ఏపీ నుండి అనుమతి తీసుకుండా ఇసుక తీసుకొచ్చిన లారీని ఖమ్మం మమతా రోడ్డులో సీజ్ చేశారు. జిల్లా సరిహద్దుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పరిశీలిస్తున్నామని అధికారులు చెబుతున్నా రవాణా ఆగకపోవడం గమనార్హం. ఏపీతో పాటు ఇతర జిల్లాల నుంచి రాత్రివేళ ఇసుక తప్పించి నగర శివార్లలో డంప్ చేయిస్తున్నారు. ఆపై ట్రాక్టర్లలో కావాల్సిన చోటకు చేర్చి అధిక మొత్తంలో దండుకుంటున్నట్లు సమాచారం. గతంలో అధికార పక్షం నాయకులే ఇసుక వ్యాపారం సాగించారనే విమర్శలు రాగా.. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక మట్టి, ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు ఉంటాయని అంతా భావించారు. దీంతో భయపడిన అక్రమార్కులు కొన్నాళ్లుగా గుట్టుగా ఉన్నారు. కానీ మళ్లీ దందా మొదలుపెట్టినా అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గతంతో పోలిస్తే బాగా తగ్గింది...



జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలను గతంలో కంటే నిరోధించగలిగాం. ఎక్కడైనా సరే మట్టి తవ్వినా, తరలించినా సమాచారం అందిన వెంటనే అడ్డుకుని కేసులు నమోదు చేస్తున్నాం. అంతేకాక జరిమానా కూడా విధిస్తున్నాం. అందుబాటులో ఉన్న సిబ్బందితోనే గస్తీ కొనసాగుతోంది. ఏదిఏమైనా గతంలో ఆరోపణలు ఉన్నంత మేర జిల్లాలో ఇప్పుడు జరగడం లేదు.

– ఆర్.సాయినాథ్, మైనింగ్ ఏడీ

లాభాపేక్ష లేకుండా జనరిక్ మందుల అమ్మకం



షాప్‌ను ప్రారంభిస్తున్న ద్రౌపతి, పక్కన రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు

ఖమ్మం అర్బన్: సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా లాభాపేక్ష లేకుండా నాణ్యత కలిగిన జనరిక్ మందులను అమ్మేందుకు షాపు ఏర్పాటుచేసినట్లు వీవీసీ, బీవీకే ట్రస్ట్‌ల చైర్మన్లు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, నున్నా నాగేశ్వరరావు తెలిపారు. వీవీసీ–బీవీకే సంయుక్త ఆధ్వర్యాన ఖమ్మం వైరా రోడ్డులోని డాక్టర్ సత్యనారాయణ హాస్పిటల్ కాంప్లెక్స్‌లో ఏర్పాటుచేసిన జనరిక్ మందుల షాపును వీవీసీ ట్రస్ట్ అధినేత ద్రౌపతితో కలిసి రాజేంద్రప్రసాద్, నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షణ, శరీరంపై ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండని జనరిక్ మందులు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, మిక్కిలినేని నరేందర్, బాబ్జీ, వై.శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, సుబ్బారావు, మాదినేని రమేష్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



పీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటుతున్న చందూనాయక్

పెనుబల్లి: ప్రభుత్వాస్పత్రులపై నమ్మకంతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందూనాయక్ సూచించారు. మండలంలోని లంకాసాగర్ పీహెచ్‌సీని బుధవారం సందర్శించిన ఆయన వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రతిరోజు ఎంచుకున్న గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించగా వివరాలు తెలుసుకున్నారు. ఆపై ఫార్మసిస్ట్ డే సందర్భంగా మొక్క నాటారు. డాక్టర్ కిరణ్‌కుమార్, ఉద్యోగులు పోలమ్మ, మెహరున్నీసా బేగం, సుగుణ, దేవ, బి.నాగేశ్వరరావు, బాసీరుదీన్, అనురాధ, మల్లేశ్వరి, రాజ్యలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పైనుంచి వాహనాలకు అనుమతి



ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై వెళ్తున్న ద్విచక్ర వాహనదారులు

ఖమ్మంక్రైం: మున్నేటి వరద తాకిడికి దెబ్బతిన్న ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసిన విషయం విదితమే. అయితే, వివిధ ప్రాంతాల ప్రజలు ఈ నిర్ణయంతో చుట్టూ తిరిగి వెళ్లడం ఇబ్బందిగా మారింది. ప్రతిరోజు ఖమ్మం రూరల్, కోదాడ తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది ఖమ్మం వచ్చివెళ్తారు. అయితే, బ్రిడ్జి పైనుంచి రాకపోకలు లేకపోవడంతో వీరంతా కాల్వొడ్డు ప్రాంతం నుంచి వచ్చివెళ్తుండడంతో ఆరు కి.మీ. మేర దూరం పెరుగుతోంది. మరికొందరు బ్రిడ్జి గోడపై నుంచి వెళ్తుండడంతో గాయపడుతున్నారు. ఈ సమస్యలను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కేవలం ద్విచక్ర వాహనాలను అధికారులు బుధవారం నుంచి అనుమతించారు. భారీ వాహనాలను మాత్రం బ్రిడ్జిపై మరమ్మతులు పూర్తయ్యేలా అనుమతిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వైరాలో ఆగని ఆక్రమణలు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో రెండు రోజులుగా ప్రభుత్వ స్థలాలను పలువురు ఆక్రమించుకుని గుడిసెలు వేస్తుండగా అడ్డుకుంటున్నారు. అయినా బుధవారం కూడా 13, 14వ వార్డుల్లో గతంలో ఉన్న ఎన్నెస్పీ కాల్వపై గుడిసెలు వేసేందుకు కొందరు ప్రయత్నం చేయగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. శాంతినగర్ నుండి అయ్యప్ప స్వామి దేవాలయం వరకు ఎన్నెస్పీ స్థలాలు ఆక్రమించుకునేందుకు చుట్టూ తాళ్లు, తీగలు కట్టి హద్దులు నిర్ణయించుకోవడం గమనార్హం. ఈసందర్భంగా ఆర్ఐ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది చేరుకుని అక్కడ ఉన్న వారిని హెచ్చరించారు. ఆపై మధిర రోడ్డు నుండి శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్ స్కూల్ పాఠశాల వరకు సర్వే చేశారు. ఇప్పటికే 33 మంది స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకున్నందున నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

జిల్లాకు 15మంది ట్రెయినీ ఎస్సైలు



సీపీకి మొక్క అందిస్తున్న ట్రెయినీ ఎస్సైలు

ఖమ్మంక్రైం: రాష్ట్ర పోలీస్ అకాడమీలో తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 547మంది ఎస్ఐలను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కేటాయించారు. ఇందులో భాగంగా ఖమ్మం కమిషనరేట్‌కు పదిహేను మంది సివిల్ ఎస్సైలను కేటాయించారు. వీరిలో ఐదుగురు బుధవారం ఖమ్మం చేరుకోగా సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకోవడంపై ఆయన వారిని అభినందించారు. శాఖాపరమైన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించి ఉన్నత స్థాయికి ఎదగాలని సీపీ ఈ సందర్భంగా సూచించారు.

ఉత్సాహంగా అండర్-19 టీ.టీ పోటీలు



విజేతలతో డీవైఎస్ఓ, అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 జూనియర్ కళాశాలల క్రీడల్లో భాగంగా బుధవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. పోటీలకు 40మంది క్రీడాకారులు హాజరుకాగా బాలుర విభాగం నుంచి పరిటాల జ్వలిత్, సోడియం రాధాకృష్ణ, సాయి, మోహిత్‌కృష్ణ, తరుణ్ విజేతలుగా నిలిచారు. ఇక బాలికల విభాగంలో పి.శ్రీఅమృత, నవ్య, భానోత్ కుమారి, సుప్రియ, చంద్రిక రాణి విజేతలుగా నిలవగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలసాని విజయ్‌కుమార్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డితో పాటు చలపతిరావు, జానీపాషా, వీవీఎస్.మూర్తి, ఎం.డీ. మూసాఖాలీం బహుమతులు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులపై అవగాహన

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులపై బుధవారం ఖమ్మంలోని విశ్రాంతి భవనంలో ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన వజ్ర టాన్స్‌ఫార్మర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పలు అంశాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఎన్పీడీసీఎల్ కార్యాలయం సీజీఎం కిషన్, ఖమ్మం ఎస్ఈ సురేందర్, ఎంఆర్‌టీ డీఈ భద్రుపవార్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో విద్యుత్ గృహోపకరణాలు దగ్ధం

రఘునాథపాలెం: పిడుగుపాటు కారణంగా ఓ ఇంట్లో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పరిధి జగ్యాతండాలోని బానోత్ నాగేశ్వరరావు ఇంటిపై మంగళవారం రాత్రి పిడుగు పడింది. ఈ ఘటనలో విద్యుత్ మీటర్ పక్కన ఉన్న స్విచ్ బోర్డ్ కాలిపోవడమే కాక టీవీ, ఫ్రిడ్జి, వాషింగ్ మిషన్, ఏసీ, వాటర్ ప్యూరిఫైర్, ఫ్యాన్లు కాలిపోయాయని నాగేశ్వరరావు తెలిపారు. ఘటనలో సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొనగా, పంచాయతీ కార్యదర్శి కృష్ణ బుధవారం ఉదయం పరిశీలించారు. కాగా, పిడుగు పడిన సమయాన కుటుంబీకులంతా ఇంట్లోనే ఉన్నా ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిని ఖమ్మం డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన సునీల్ ఒడిశా రాష్ట్రంలో గంజాయి కొనుగోలు చేసి బస్సులో బయలుదేరాడు. ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద డీటీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టగా ఆయన నుంచి రూ.1.60లక్షల విలువైన 25కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ కరుణశ్రీ, ఎస్ఐ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	4,000
పెసలు(మార్క్‌ఫెడ్)	8,682	8,682
మిర్చి	17,000	10,000
మిర్చి తాలు	9,150	8,500
ఏసీ మిర్చి	20,000	10,300
ఏసీ తాలు	9,400	8,500
కొత్త పత్తి	7,211	5,800
పాత పత్తి	7,600	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

'సిరి' సీడ్స్ రూ.5లక్షల విరాళం





మంత్రి తుమ్మలకు చెక్కు అందిస్తున్న సిరి సీడ్స్ యాజమాన్యం, జానకీరామ్

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం అర్బన్: వరద బాధితులను ఆదుకునేందుకు గాను సిరి సీడ్స్ యాజమాన్యం బుధవారం రూ.5లక్షల విరాళాన్ని అందజేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు చెక్కు అందజేయగా ఆయన అభినందించారు. సిరి సీడ్స్ ఎండీ పెద్దిన మురళీకృష్ణ, అరిమిల్లి వివేకానంద్, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం 5వ డివిజన్‌కు చెందిన గుత్తా జానకీరామ్ రూ.లక్ష చెక్కును మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేయగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లెబోయిన చంద్రం, మోత్కూరి శ్రీనివాస్, ఆళ్ల రాము, ఎం.డీ.ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై సర్వే



రోడ్డు కొలతలు వేయిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో రోడ్డు ఆక్రమణలను గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో రోడ్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం 19వ డివిజన్‌లోని మమతా రోడ్డు నుండి అల్లీపురం వెళ్లే క్రాస్ వరకు రహదారి కొలతలు వేశారు. పలుచోట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు తెలియడంతో వెంటనే తొలగించాలని బాధ్యులకు నోటీసులు జారీ చేశారు. కాగా, నగరమంతా ఇలాగే సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లి: సత్తుపల్లికి చెందిన షేక్ పాషామియా బుధవారం పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలికకు బాబాయ్ వరుస అయ్యే ఆయన అసభ్యంగా ప్రవర్తించడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పాషామియాపై పోక్సో కేసు నమోదు చేయగా, కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాలు విడుదల

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ మొదటి సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తంగా ముగ్గురు డిస్టింక్షన్ సాధించారని ప్రిన్సిపాల్ రాజశ్వరరావు తెలిపారు. ఇక 61 మంది ఫస్ట్ క్లాస్‌లో, 33 మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని వెల్లడించారు. మరో ముగ్గురి ఫలితాలు విత్‌హెల్డ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఆయన అభినందించారు.

తమ్మిలేరులో వ్యక్తి గల్లంతు?

వేంసూరు: మండలంలోని కందుకూరు తుంగవారి కాలనీకి చెందిన తుంగ రామారావు తమ్మిలేరులో గల్లంతైనట్లు తెలిసింది. ఆయన బుధవారం మధ్యాహ్నం తమ్మిలేరు సమీపాన ఉన్న గేదెల కోసం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రామారావు ఆచూకీ కోసం స్థానికులు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. తమ్మిలేరులో వరద ఎక్కువగా ఉండడంతో కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



పౌల్ట్రీలో మేత తయారీ వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీఓ, తదితరులు

కూసుమంచి: మహిళలు ఎంచుకున్న రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీఓ సన్యాసయ్య సూచించారు. మండలంలోని జుజుల్‌రావుపేటలో బుధవారం సెర్ప్ ఏపీఎంలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పౌల్ట్రీ, పాడి పరిశ్రమ, చేపలు, రొయ్యలు, గొర్రెల పెంపకం యూనిట్ల నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం సహకరిస్తుందని డీఆర్‌డీఏ తెలిపారు. అనంతరం యూనిట్ల నిర్వాహకులను సన్మానించడంతో పాటు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. అడిషనల్ డీఆర్డీఓ నూరుద్దీన్, డీపీఎంలు శ్రీను, పద్మ, దర్గయ్య, రేవతి, శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం సత్యవర్ధన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో యాజమాన్య పద్ధతులే కీలకం

వైరా: పత్తి సాగు చేస్తున్న రైతులు సరైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు సాధించొచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై క్షేత్ర దినోత్సం, వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి రైతులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ సహ పరిశోధన వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు వల్ల లాభాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆతర్వాత అగ్రానమి శాస్త్రవేత్త డాక్టర్ యూ.నాగభూషణం, శాస్త్రవేత్త జి.వీరన్న, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన డాక్టర్ జె.హేమంత్‌కుమార్, కేవీకే కోఆర్డినేటర్ కె.రవికుమార్, మధిర వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి పలు అంశాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు వి.చైతన్య, జెస్సీ సునీత, ఫణిశ్రీ, వ్యవసాయశాఖ అధికారులు కరుణశ్రీ, విజయ్‌చంద్ర, మధుసూదన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి...

జెడ్పీ సీఈఓ దీక్షారైనా

కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ఆధారంగా మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని జెడ్పీ సీఈఓ దీక్షా రైనా సూచించారు. కొణిజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వంట షెడ్డు, బాలికల డైనింగ్ హాల్‌ను పరిశీలించాక బాలికలతో కలిసి భోజనం చేశారు. రోజువారీ మెనూ అమలు, నాణ్యత వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా, బాలికలకు మాత్రమే డైనింగ్ హాల్ ఉండడం, బాలురు చెట్ల కింద భోజనం చేస్తుండడంపై ఆరా తీసిన ఆమె మరో డైనింగ్ హాల్ నిర్మాణానికి అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ రోజారాణికి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ డి.అబ్రహం, హెచ్ఎం కాంతతకుమారి, ఏపీఓ అమ్మాజాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొణిజర్ల : పాఠశాలలో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

ఇబ్బందులు ఎదురుకావొద్దు

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే క్రమాన ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. చింతకానిలోని ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఆమె నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డీఎల్‌పీఓ రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు బీ.వీ.శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొణిజర్ల : భోజనం చేశాక బాలికలతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా



చింతకాని : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీపీఓ ఆశాలత, అధికారులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



చెన్నారావు (ఫైల్)

సత్తుపల్లిరూరల్: గొర్రెలను మేతకు తీసుకెళ్లి వస్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన కొప్పుల చెన్నారావు(53) తన భార్య కుమారితో కలిసి మంగళవారం గొర్రెలను మేపుకొని సాయంత్రం ఇంటికి వస్తుండగా రుద్రాక్షపల్లి వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలైన చెన్నారావును విజయవాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉండగా, ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి..

చింతకాని: చింతకాని–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(40) బుధవారం రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న రైలు నుంచి ఆయన జారిపడ్డాడు. ఛామనఛాయ రంగు కలిగిన వ్యక్తి ఛాతిపై పుట్టుమచ్చ ఉండగా, తెల్లని కట్ బనియన్, నల్లని లోయర్ ధరించి ఉన్నాడు. ఇతర ఆధారాలు లభించకపోవడంతో అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

ఫ్లైఓవర్‌పై నిలిచిన నీరు... కారుకు ప్రమాదం

నేలకొండపల్లి: జాతీయ రహదారి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ఫ్లైఓవర్‌పై నీరు నిలిచి ప్రమాదం జరిగిందని పలువురు టోల్‌గేట్ వద్ద ఆందోళనకు దిగారు. కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి మీదుగా ఖమ్మంకు చెందిన జె.కృష్ణ కారులో మంగళవారం రాత్రి కోదాడ వెళ్తున్నాడు. నేలకొండపల్లి మండలం బోదులబండ క్రాస్‌లోని ఫ్లైఓవర్‌పై నీరు నిలిచి ఉండడంతో ఆయన కారు గోడకు గుద్దుకుని ప్రమాదం జరిగింది. ఇంతలోనే వెనుక నుంచి వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలో పైనంపల్లి టోల్‌గేట్ వద్దకు వెళ్లిన బాధితులు నిర్వాహకులను నిలదీశారు. హైవే పనులు అసంపూర్తిగా ఉన్నప్పటికీ టోల్ వసూలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కాగా, హైవే అధికారులు, కాంట్రాక్టర్, టోల్‌గేట్ నిర్వాహకులపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

మద్యం దుకాణంలో ఇరువర్గాల ఘర్షణ

నేలకొండపల్లి: మద్యం దుకాణంలో పలువురు ఘర్షణ పడిన ఘటన ఇది. మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో బుధవారం ఇరువర్గాల వారు మద్యం సేవిస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ విషయమై పంచాయితీ జరిగింది. ఈ నేపథ్యాన ముదిగొండకు చెందిన ముగ్గురు, నేలకొండపల్లి మండలం బైరవునిపల్లికి చెందిన ఇరువురి మధ్య వివాదం పెరిగి మద్యం మత్తులో ఉన్న వారు వీరంగం సృష్టించారు. ఇరువర్గాల వారు సీసాలతో కొట్టుకున్నట్లు తెలియగా, ముదిగొండ మండలం యడవల్లి లక్ష్మీపురానికి చెందిన వంశీ, బైరవునిపల్లికి చెందిన కె.భానుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకున్నారు.

27న తిరుమలకు మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నా రు. ఈనెల 27 శుక్రవారం రాత్రికి ఆయన తిరుమల చేరుకుంటున్నారు. మరుసటి రోజు (28న), శనివారం ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకుంటారు.

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఈ నెల 28న (శనివారం) ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. తిరుమల పవిత్రతను, వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం విశిష్టతను, స్వామి వారి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని అన్నారు. కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో శనివారంనాడు ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ, నీలిమ మెడికల్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించేంత వరకు మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్, కాళోజీ నారాయణ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారిద్దరిని పదవుల నుంచి తొలగించాలని కోరారు.

బాబు కుట్రకు పోలీసు వత్తాసు

వేధించి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే కుతంత్రం ● లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు పన్నాగం

- వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'
- సిట్ ఏర్పాటు తరువాత కూడా పోలీసులకు ఫిర్యాదు
- ముందు రోజు రాత్రే సీఐని వీఆర్‌కు పంపిన ప్రభుత్వం
- తమ అనుకూల అధికారిని నియమించిన తరువాతే ఫిర్యాదు
- ఇప్పటికే వీర విధేయులతో 'సిట్'.. తాజాగా పోలీసు అస్త్రం
- తమ కుట్రను ప్రశ్నిస్తున్న వారిని వేధించేందుకు చంద్రబాబు వ్యూహం
- నెయ్యిపై రాద్ధాంతం అంతా తమ అనుకూల డెయిరీలకు కాంట్రాక్టు ఇప్పించి తెర వెనుక హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకే

సాక్షి, అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారం బెడిసికొట్టడంతో సీఎం చంద్రబాబు కొత్త కుట్రకు తెర తీశారు. అవాస్తవ ఆరోపణల కుతంత్రం తన మెడకే చుట్టుకుంటుండంతో ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోవడంతో ఆ వివాదమంతా టీడీపీ ప్రభుత్వ సృష్టేనని జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ అంశంపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ అంశంపై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుంటే తన కుట్ర బట్టబయలవుతుందని బెంబేలెత్తుతున్నారు. దీంతో తాను సృష్టించిన వివాదాన్ని తనకు అనుకూలంగా ముగించేందుకు చంద్రబాబు దారులు వెతుకుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'ఏర్పాటు చేసినప్పటికీ ఆయన స్థిమితపడలేకపోతున్నారు. అందుకే లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో టీటీడీ అధికారులతో బుధవారం ఫిర్యాదు చేయించారు. పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తిమ్మిని బమ్మి చేసే కుతంత్రానికి పదును పెడుతున్నారు.

పక్కా పన్నాగంతోనే పోలీసులకు ఫిర్యాదు

లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూనే చంద్రబాబు ప్రభుత్వం పోలీసు అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధ పడింది. కల్తీ నెయ్యి సరఫరా చేశారని గుర్తించామని చెబుతున్న రెండు నెలల తరువాత టీటీడీ తీరిగ్గా తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేయడం గమనార్హం. తమిళనాడుకు చెందిన నెయ్యి సరఫరాదారు ఏఆర్ డెయిరీపై టీటీడీ జనరల్ మేనేజర్ (స్టోర్స్) పి.మురళీకృష్ణ ద్వారా ప్రభుత్వం ఫిర్యాదు చేయించింది. నెయ్యి కల్తీ జరిగిందని జూలై 23నే టీటీడీకి నివేదిక వచ్చిందన్న చంద్రబాబు సెప్టెంబరు 20న తొలిసారిగా వెల్లడించి దుష్ప్రచారానికి తెరతీశారు. మరి కల్తీ జరిగిందని తెలిసిన జూలై 23నే ఆహార భద్రతా చట్టం కింద టీటీడీ ఎందుకు కేసు నమోదు చేయలేదన్న న్యాయ నిపుణుల ప్రశ్నకు ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేక పోయింది. టీటీడీ ఈవో శ్యామలరావు మొదట ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ కలిసిందని... అయితే ఆ నెయ్యి వాడలేదని.. తిప్పి పంపామని వెల్లడించారు. అంతేగానీ జంతువుల కొవ్వు కలిసిందని ఆయన చెప్పలేదు. జంతువుల కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ నివేదికలో కూడా వెల్లడించలేదు. కానీ తరువాత ఈ నెల 20న సీఎం చంద్రబాబు కుట్రపూరితంగా నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే దుష్ప్రచారం మొదలు పెట్టడంతో శ్యామలరావు కూడా మాట మార్చక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలోని డొల్లతనంపై నిపుణులు సూటిగా ప్రశ్నలు సంధిస్తుండటంతో చంద్రబాబు బెంబేలెతున్నారు. దాంతో తమను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసేందుకు పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారాన్ని పతాకస్థాయికి చేర్చిన చంద్రబాబు బృందం తాజాగా తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ముసుగులో వేధింపుల కుట్రకు తెర తీసింది.

హెరిటేజ్ కోసమే ఇదంతా..!

"టీటీడీకి సరఫరా అయ్యే నెయ్యిపై రాద్ధాంతం చేసి వివాదాన్ని సృష్టించడం ద్వారా తమకు అనుకూలంగా నడుచుకునే కొన్ని ప్రైవేట్ డెయిరీలతో కలసి సిండికేట్‌గా ఏర్పడి హెరిటేజ్‌కు అడ్డగోలుగా వ్యాపార ప్రయోజనాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఎత్తుగడ వేసినట్లు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు సైతం చర్చించుకోవడం గమనార్హం. ఏదో ఒక డెయిరీకి కాంట్రాక్టు ఇప్పించి తెర వెనక హెరిటేజ్ కార్యకలాపాలు సాగించేలా పథకం వేసినట్లు పేర్కొంటున్నారు"



- తిరుపతి ఈస్ట్ పోలీసులకు టీటీడీ బుధవారం ఫిర్యాదు చేసింది. అయితే ఆ ముందు రోజే అంటే మంగళవారం రాత్రే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం హఠాత్తుగా వీఆర్‌కు పంపించింది. ఆయన స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న తమకు విధేయుడైన ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించింది. లడ్డూ అంశంపై అక్రమ కేసు నమోదు చేసేందుకు మహేశ్వర్‌రెడ్డి సుముఖత చూపలేదని సమాచారం. దాంతో ఆయన్ని తప్పించి తమకు విధేయుడైన అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఫిర్యాదులపై విచారణ నిర్వహించాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌దే. టీడీపీ ప్రధాన కార్యాలయం చెప్పినట్లుగా దర్యాప్తు పేరిట వేధింపులకు పాల్పడే అధికారిని నియమించుకునేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

మరి.. నాడు బాబు హయాంలోనూ కల్తీ జరిగిందా?

నెయ్యి కల్తీ జరిగినట్లు ప్రాథమిక ఆధారంగా టీటీడీ ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన అంశం విడ్డూరంగా ఉంది. కేజీ నెయ్యి రూ.319.80 చొప్పున సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీ అంగీకరించడమే కల్తీ చేశారనేందుకు ప్రాథమిక ఆధారం అని పేర్కొనడం గమనార్హం. మరి కేజీ రూ.319.80 చొప్పున సరఫరా చేయడమే కల్తీ చేసినట్టుగా భావించాలంటే.. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015లో కేజీ రూ.276 చొప్పున, 2018లో రూ.320 చొప్పునే టీటీడీ నెయ్యి కొలుగోలు చేసింది. ఇక అప్పుడు కూడా కల్తీ చేసినట్లే భావించాలి కదా...? నాడు టీడీపీ హయాంలో నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై కూడా ఫిర్యాదు చేయాలి కదా? అని నిపుణులు నిలదీస్తున్నారు.

సిట్ వేశాక పోలీసులకు ఫిర్యాదా...!

లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం మంగళవారం తమకు వీర విధేయులైన పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు కొమ్ము కాసిన గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక సిట్‌లో సభ్యుడిగా నియమించిన విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అల్లుడు. రిటైరైన తరువాత హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా పని చేసిన కృష్ణయ్య అనంతరం 2014–19లో టీడీపీ హయాంలో ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన్ని కూటమి ప్రభుత్వం తాజాగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా నియమించింది. ఆయన అల్లుడు గోపీనాథ్ జెట్టీని సిట్ సభ్యుడిగా నియమించడం ద్వారా చంద్రబాబు కుతంత్రం బహిర్గతమవుతోంది. అయినా సరే చంద్రబాబులో ఆందోళన తగ్గలేదు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని జాతీయ స్థాయిలో పార్టీలు, నిపుణులు, న్యాయవేత్తలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. తన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో చంద్రబాబులో ఆందోళన మరింత తీవ్రమైంది. సుప్రీంకోర్టు విచారణకు ఆదేశిస్తే టీడీపీ సర్కారు కుట్ర మొత్తం బయటపడుతుందన్నది ఆయనకు తెలుసు. తమ కుట్రను కప్పిపుచ్చేందుకు సిట్‌తో సరిపెట్టలేమని భావించారు. అందుకే పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తనకు అనుకూలంగా లొంగదీసుకునే కుతంత్రానికి తెరతీశారు. తాజాగా తిరుపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం ద్వారా మరోవైపు నుంచి కూడా విచారణ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

విచారణ పేరిట వేధింపుల కుట్ర..

రాజకీయ ప్రత్యర్థులు, డెయిరీల యాజమాన్యం, ఎంపిక చేసుకున్న అధికారులు, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడాలన్నదే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర. అక్రమ కేసుల్లో ఇరికించి అనంతరం కొందర్ని అప్రూవర్‌గా మార్చుకుని తమ కుట్ర వాదనను వారితో ఒప్పించాలనే కుతంత్రం పన్నింది. సిట్ పూర్తి స్వరూపాన్ని ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. నివేదికతో సరిపెట్టాలా? అంతకుమించి అధికార పరిధి కల్పిస్తారా? అనేది స్పష్టం చేయలేదు. మరోవైపు తిరుపతి పోలీసులు కేసు విచారణ పేరిట వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అమరావతిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం డైరెక్షన్ మేరకే తిరుపతి పోలీసుల విచారణ హైడ్రామా కొనసాగనుంది. ఎవరెవరిని విచారణకు పిలవాలి..? ఎలా భయపెట్టాలి..? ఎలా వేధించాలన్నది అంతా టీడీపీ పర్యవేక్షణలోనే సాగనుందన్నది సుస్పష్టం. లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారానికి వత్తాసు పలకాలని.. తప్పుడు వాంగ్మూలాలు ఇవ్వాలని... లేదంటే కేసుల్లో ఇరికించి అరెస్టులతో వేధిస్తామని పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలన్నది చంద్రబాబు కుతంత్రం అని స్పష్టమవుతోంది.



మహేశ్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కుల గణన.. కాంగ్రెస్ పేటెంట్

- నాలుగైదు రోజుల్లో విధి విధానాలు పూర్తిచేస్తాం
- బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సనత్‌నగర్ (హైదరాబాద్): కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, అది జరగనిదే స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో కూడా నలుగురు బీసీలకు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు. 'సమగ్ర కుల గణన–బీసీ రిజర్వేషన్ల పెంపుపై'బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కులగణన అంశాన్ని తెర మీదకు తీసుకువచ్చిన నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎవరికి దక్కాల్సిన ఫలాలు వారికి అందాలనే ఉద్దేశంతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. నాలుగైదు రోజుల్లో కులగణనపై విధి విధానాలను ఖరారు చేసి ఆ దిశగా ముందుకు సాగుతామన్నారు. రాష్ట్ర ఖజానా అధ్వాన్న స్థితిలో ఉందని, నెలసరి ఆదాయం 18 వేల కోట్లు కాగా, గత ప్రభుత్వం చేసిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు తీర్చేందుకే ఎక్కువ శాతం ఆదాయం కేటాయిస్తూ వస్తున్నట్లు చెప్పారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అనవసర ప్రాజెక్టులతో దుబారా చేసి అప్పులపాలు చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కులగణన అంశాన్ని లేవనెత్తగానే బీజేపీ కూడా స్వరం మార్చి ఆర్‌ఎస్‌ఎస్‌తో మద్దతు తెలియజేస్తోందన్నారు. బీజేపీ హయాంలో పెట్టుబడిదారులకు న్యాయం జరిగిందే తప్ప ప్రజలకు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నష్టాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేసిందే తప్ప లాభాల్లో ఉన్న వాటి జోలికి వెళ్లలేదని, నేడు బీజేపీ లాభాల్లో ఉన్న సంస్థలను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ కూడా కులగణనకు మద్దతు అంటూ ఇప్పుడు చెబుతోందని, గత పదేళ్ల ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కులగణన జరిపి తీరుతామని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు.

జిల్లా వార్తలు

రామయ్య సన్నిధిలో పూజలు



ఆలయంలో సుజాతగుప్తా తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామ చంద్ర స్వామి వారిని బుధవారం తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతగుప్తా దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో పూజలు చేయగా, పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు అందించారు. అలాగే, ఏపీలోని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష కూడా కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు కాటమయ్య కిట్లపై శిక్షణ



గీత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుండాల: కల్లుగీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్లు అందిస్తుండగా బుధవారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఆళ్లపల్లి మండలం మర్కోడులో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర మాట్లాడుతూ.. జిల్లాలో 185 మందికి కిట్లు ఇవ్వనుండగా, వినియోగంపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. తాటిచెట్టు ఎక్కి, దిగే క్రమాన ప్రమాదాలకు గురికాకుండా ఈ కిట్లు ఉపయోగపడతాయని, రూ.15 వేల విలువైన ఈ కిట్.. 300 కేజీల బరువు మోసేలా రూపొందించారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ ఉద్యోగులు మానస, నాగానంద్, యాకూబ్‌పాషా, వెంకటేశ్వర్లు, గీత కార్మికులు తాళ్లపల్లి వెంకన్న, శ్రీరాం సమ్మయ్య, బత్తిని సాయన్న, యాసారపు బాబు, యాసారపు వెంకన్న, బొంగు సిద్ధయ్య, కాసబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకృతితో మమేకం!



నైవేద్యానికి సిద్ధం చేసిన వంటకాలతో ఆదివాసీలు

- విభిన్నంగా ఆదివాసీల జీవనం
- వారసత్వాన్ని పరిరక్షించుకునేలా 'కొత్తల పండుగ'
- ఆదివాసీ గూడేల్లో కొనసాగుతున్న వేడుకలు

కరకగూడెం: పట్టణీకరణకు దూరంగా జీవనం సాగించే ఆదివాసీలు ఏళ్లు గడిచినా తమ సంస్కృతి, సంప్రదాయాలను మాత్రం కొనసాగిస్తూనే ఉంటారు. ఇందులో భాగంగానే వారి జీవన శైలిని ప్రతిబింబించే పండుగలను జరుపుకుంటారు. ఏటా ఆదివాసీలు ప్రధానంగా ఆరు పండుగలు నిర్వహిస్తారు. భూమి పండుగ, పొట్ట పండుగ, వెన్నుగంటి పండుగ, కొత్తల పండుగ (పెద్దల పండుగ), మండమెలిగే పండుగ, చిక్కుడు పండుగగా పిలిచే వీటిని నియమిత రోజుల్లో జరుపుకుంటారు. ప్రకృతికి అనుబంధంగానే జరిగే కొత్తల (పెద్దల) పండుగను వారం రోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆదివాసీలు జరుపుకుంటున్న నేపథ్యాన కథనం.

గిరిజన వారసత్వ పరిరక్షణ

తరతరాల వారసత్వాన్ని పరిరక్షించుకోవడమే కొత్తల పండుగ ప్రధాన ఉద్దేశమని ఆదివాసీలు నమ్ముతారు. వానాకాలంలో మొదట్లో సాగు చేసే పంట చేతికొచ్చిన సందర్భంగా ప్రకృతి, దేవతలను కొలిచి వారికి నైవేద్యాలు సమర్పించాకే పంట, కూరగాయలు, పండ్లను ఆదివాసీలు భుజించడం ఆనవాయితీ. ఉత్తర కార్తె మొదటి వారం అంటే సెప్టెంబర్‌లో పెద్దల పండుగ జరుపుకుంటారు. గూడెంల వారీగా ఒక్కోరోజు పండుగ జరుపుకుంటుండగా.. ఇంటిని అలికి ముగ్గులు వేస్తారు. గుమ్మానికి మామిడి, వేపాకులతో తోరణాలు కట్టి మొక్కజొన్న కానీ వరి కంకులను కానీ తోరణాల మధ్య కడతారు. ఆపై పెద్ద మనుషులు తెల్ల పంచె కట్టుకుంటారు. ఆ తర్వాత సమ్మక్క, సారలమ్మ, నాగులమ్మ, ముత్యాలమ్మ, కొమ్మలమ్మ, ముసలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, మూగరాజు, గాదె రాజు, బాల కుమారస్వామి, కాతూరుడు మొదలగు ఇలవేల్పులను కొలుస్తారు. ఆపై కోడిపెట్టను అర్పించి పాల ఆకులు, ఇప్పఆకులు ఇంటికి తీసుకొస్తారు. నూకల బియ్యాన్ని వడ్డె కుటుంబ సభ్యులందరికీ ఇస్తాడు. అంతేకాక ఈ ఏడాది కాలంలో చనిపోయిన వారు, మూడు తరాల వారిని స్మరించుకుంటారు.



నైవేద్యం సమర్పిస్తున్న ఆదివాసీలు


కొత్త కోడలి గోత్రం మార్పిడి

ఈ పండుగ సందర్భంగా గూడెం మొత్తం సందడి నెలకొంటుంది. ఉన్నంతలో కోడి కూర వంటివి సిద్ధం చేసి అన్నం వండాక వంశ సభ్యులందరికీ వడ్డిస్తారు. శానార్తి సెలవు పదంతో సెలవు అడిగి భోజనం చేస్తారు. ఆపై కొత్తగా పెళ్లయి అత్తారింటికి వచ్చిన యువతి ఆమె పుట్టింటి వారి గట్టు, గోత్రాలను విడిచి తన భర్త గట్టు, గోత్రాలలోకి మార్పిడి చెందుతుంది. మరునాడు ఉదయం పెద్దలు పెతర్ల పేరుతో అన్నదానం, వస్త్రదానం చేసి పండుగ ముగిసిందని భావిస్తారు.

ప్రకృతి ఆరాధన

కొత్తల పండుగ గిరిజనులకు సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సామాజిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ పండుగను ప్రాంతాల వారీగా జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి వెనుక కోతల దేవిని గౌరవించడడంతో పాటు అడవులు, వన్య ప్రాణులు, తెగలను రక్షించే దేవతను ఆరాధించి ఆశీర్వాదం పొందడం ఉంటుంది. ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపి ప్రకృతి అనుగ్రహం పొందడానికి, ఆదివాసీ వర్గాల మధ్య సామాజిక సంబంధాలు, ఐక్యతను బలోపేతం చేయడానికి పండుగ ఉపకరిస్తుందని భావిస్తారు.


దేవతల ఆశీస్సులు పొందుతాం



కొత్తల పండుగ గృహాలు, దేవాలయాలను శుభ్రపరచడం, అలంకరించడం ద్వారా ప్రారంభమవుతుంది. దేవతలకు ప్రార్థన చేసి పూలు, పండ్లు సమర్పించి ఆశీస్సులు పొందుతాం. ఆచారాలను గౌరవిస్తూ వేడుక జరుపుకుంటాం. పూర్వీకుల వారసత్వంగా సంతోషకరమైన వాతావరణంలో పండుగ సాగుతుంది.

–కుడం జోగమ్మ, అంగారుగూడెం

ప్రకృతి వేడుక 'కొత్తల పండుగ'..



ఆదివాసీలు జరుపుకునే కొత్తల పండుగ ప్రకృతి వేడుక వంటిది. ఇది ఆదివాసీ వర్గాల గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తుంది. బంధాలను బలపరిచి ఐక్యతను ప్రోత్సహిస్తుంది. సంప్రదాయ పద్ధతులు, సంగీతం, నృత్య రూపాలను సంరక్షించడమే కాక పర్యావరణం, ప్రకృతి పరిరక్షణకు ఉపయోగపడుతుంది.

–తోలెం రమేశ్, ఆధార్ స్వచ్ఛంద స్వంస్థ వ్యవస్థాపకులు

గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



వీసీలో పాల్గొన్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: ఏజెన్సీ పరిధిలోని గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ శరత్ హైదరాబాద్ నుంచి పలువురు అధికారులతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. గిరిజన ఆవాసాల్లోని ప్రైమరీ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో వసతులు కల్పించడమే కాక తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామీణ సడక్ యోజన పథకం కింద రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పీఎం జన్మన్ పథకం కింద కొండరెడ్ల గ్రామాల్లో రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లు, కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. భద్రాచలం, టేకులపల్లిలో ఈఎంఆర్‌ఎస్ పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు భద్రాచలం నుంచి పీఓ మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు నరేశ్, దావీద్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా లాభాల వాటా చెల్లించాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఎలాంటి షరతులు విధించకుండా సింగరేణి లాభాల్లో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేల చొప్పున చెల్లించాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్ల యూనియన్ (ఇఫ్టూ) రాష్ట్ర కార్యదర్శి పెద్దబోయిన సతీశ్ కోరారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బంగ్లోస్, రైటర్‌బస్తీ, బాబుక్యాంపు తదితర ప్రాంతాల్లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో 25 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులకు ఈ ఏడాది లాభాల వాటా నుంచి రూ.5 వేల చొప్పున చెల్లించేందుకు నిర్ణయించారని తెలిపారు. కానీ, కొందరు అధికారులు మస్టర్ల ప్రతిపాదికన నిర్ణయిస్తామని చెప్పడం సరికాదని, ఈపీఎఫ్, సీఎంపీఎఫ్ కలిగిన ప్రతీ కార్మికుడికి చెల్లించాలని కోరారు. అలాగే, ఖాళీ క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులు సుజాత, సురేశ్, శారద, ఆదిలక్ష్మి, మణెమ్మ, మల్లేశ్, రాధాకృష్ణ, పుష్పరాజ్, నరసింహ, రాజు, కరుణ, తార, పద్మ, నిర్మల, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

భద్రాచలంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 24 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఆయుష్ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. పార్ట్ టైం విధానంలో భర్తీ చేసే ఈ పోస్టుల్లో పురుషులు, మహిళలకు సగం సగం కేటాయించినట్లు ఆయుష్ భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేశ్వరరావు తెలిపారు. అర్హతలు, దరఖాస్తు వివరాలను HTTPS://AYUSH.TELANGANA.GOV.IN/ వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చని పేర్కొన్నారు. ఎస్సెస్సీ లేదా ఇంటర్ విద్యార్హత కలిగిన వారు ఈనెల 30వ తేదీన ఉదయం ఖమ్మం హోమియో ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. అర్హులు, ఆసక్తి కలిగిన వారు జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ వెంకటేశ్వరరావు (99493 79353) లేదా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ మహేశ్‌గౌడ్ (90632 38363)ను సంప్రదించాలని అధికారులు తెలిపారు. ఎంపికైన వారికి గంట పాటు కొనసాగే సెషన్‌కు రూ.250 చొప్పున రెమ్యునరేషన్ అందుతుంది.

ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా దేవరకొండ



దేవరకొండ సైదులు

ఖమ్మంసహకారనగర్: తెలంగాణ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం ఖమ్మంలోని ఎస్టీఎఫ్ కార్యాలయంలో సైదులును సంఘం నాయకులు అభినందించారు. అనంతరం సైదులు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మల్సూర్, సురేశ్, పాశం శ్రీనివాసరావు, వెంకన్న, సుధాకర్‌రెడ్డి, కరీముల్లా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి 'శ్రీ చైతన్య' రూ.25లక్షల విరాళం

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధికి శ్రీచైతన్య విద్యాసంస్థల తరఫున రూ.25లక్షల విరాళం ప్రకటించారు. ఈమేరకు చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందించారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తూనే సామాజిక బాధ్యత నిర్వర్తించడంలో తెలంగాణ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఎల్లప్పుడు ముందుంటాయని తెలిపారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌ను సీఎం అభినందించారు. ఈకార్యక్రమంలో తుమ్మల యుగంధర్, శ్రీచైతన్య డైరెక్టర్ రవితేజ, పాఠశాలల డీజీఎం చేతన్ మాధూర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంకు చెక్కు ఇస్తున్న మల్లెంపాటి శ్రీధర్